వందల్లో ఫీజు.. వేలల్లో వసూలు

- ప్రైవేట్ జూనియర్ కళాశాలల గారడీ
- అధికారులకు చెప్పినా స్పందన కరువు
- వాపోతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

గిర్మాజీపేట, నవంబర్ 24: వార్షిక ఫీజు పేరుతో జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల యజమానులు దందా ప్రారంభించాయి. రూ.వందల్లో ఉన్న ఫీజును రూ.వేలల్లో వసూలు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇంటర్నల్స్, ప్రాక్టికల్స్ అంటూ అదనంగా దండుకుంటున్నారు. ఇంటర్ ఫస్టియర్ వార్షిక పరీక్ష ఫీజు రూ.520, సెకండియర్ సైన్స్ విద్యార్థుల వార్షిక ఫీజు రూ.750 ఉండగా, రూ.2,500 నుంచి రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన వారికి సరైన సమాధానం చెప్పడం లేదని, కనీసం రసీదు కూడా ఇవ్వడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ జూనియర్ కళాశాలల నిర్వాహకులు విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో పరీక్ష ఫీజు వసూ లు చేస్తుండడంతో కొన్ని చోట్ల తల్లిదండ్రులు వారితో వాగ్వాదానికి దిగుతున్నారు. తమ కు రసీదు ఇవ్వాలని పట్టుపడుతున్నారు. దీంతో తెలివిగా కళాశాలల నిర్వాహకులు పరీక్ష ఫీజుతో పాటు ఇంటర్నల్ పరీక్షల ఫీజు వసూలు చేస్తున్న మొత్తానికి కలిపి రసీదు ఇస్తున్నారు. ఎవరైనా అధికారులకు ఫిర్యా దు చేస్తే తాము పరీక్ష ఫీజు కరెక్టుగానే తీసుకుంటున్నామని, మిగతాది ఇంటర్నల్ పరీక్షల కోసం తీసుకుంటున్నామని చెబుతూ తెలివిగా తప్పించుకుంటున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ విషయం అధికారులకు తెలిసినా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఇంటర్ బోర్డు అధికారులు పరీక్ష ఫీజు పేరుతో చేస్తున్న దందాపై దృష్టి సారించాలని, అధికంగా వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న యాదగిరి, నాయకులు

రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

పర్వతగిరి, నవంబర్ 24: రాజ్యాంగ దినోత్సవం, మహాత్మా జ్యోతిబా పూలే 134వ వర్ధంతి, అంబేద్కర్ 68వ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి కోరారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. యువత మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ నెల 28న జ్యోతిబా పూలే, డిసెంబర్ 6న అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాలు ఉన్నట్లు చెప్పారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం పర్వతగిరి అధ్యక్షుడు డాక్టర్ జిల్లా శ్రీనివాస్, జిల్లా ధర్మయ్య, దండంపెల్లి సైదులు, ఏ దర్గాస్వామి, బొట్ల వెంకటేశ్వర్లు, బానోత్ భాస్కర్, రామావత్ దీప్లానాయక్, బొట్ల ప్రభాకర్, మురళి, యాకూబ్, కుమారస్వామి, గొలుసుల యాకయ్యయాదవ్, దర్శానాయక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చెన్నారావుపేట, నవంబర్ 24: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని తిమ్మరాయిన్‌పహాడ్ క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలం ఇటుకాలపల్లికి చెందిన ఆరెల్లి సుధాకర్ పాపయ్యపేటలోని బంధువుల ఇంటికి వెళ్లి బైక్‌పై వస్తున్నాడు. ఖాదర్‌పేటకు చెందిన కరుణాకర్ బైక్‌పై నర్సంపేట నుంచి ఇంటికి వెళ్తున్నాడు. తిమ్మరాయినపహాడ్ క్రాస్‌వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించగా వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

మున్సిపాలిటీలో ఇన్‌చార్జి పాలన

- కుంటుపడుతున్న పట్టణ అభివృద్ధి
- నత్తనడకన సమగ్ర కుటుంబ సర్వే

నర్సంపేట, నవంబర్ 24: నర్సంపేట మున్సిపాలిటీకి ఇన్‌చార్జి కమిషనరే దిక్కు కావడంతో పనులన్నీ నత్తనడకన సాగుతున్నాయి. సమగ్ర కుటుంబ సర్వే పనుల్లోనూ జాప్యం జరుగుతున్నది. పట్టణంలో చాలా ఇండ్లకు స్టిక్కర్లు వేసిన పాపాన పోలేదు. కొందరు ఎన్యుమరేటర్లు పాఠశాలలకు ఇంటి యజమానులను పిలిపించుకుని సర్వేను మమ అనిపిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. కొందరికి సర్వే పనులను అప్పటికప్పుడే అప్పగించడంతో ఏం చేయాలో తోచడం లేదు. అద్దె ఇండ్లలో ఉంటున్న వారి వద్దకు సర్వే అధికారులు వెళ్లడం లేదు. పర్యవేక్షణ కొరవడడంతో సర్వేతోపాటు మున్సిపాలిటీలో చేయాల్సిన దినచర్యలను కూడా సరిగా చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. పట్టణంలో జరిగే అభివృద్ధి పనుల పర్యవేక్షణ కూడా కొరవడిందనే విమర్శలు ఉన్నాయి. ఇన్‌చార్జిల పాలనలో నర్సంపేట పట్టణ అభివృద్ధి కుంటుపడుతోంది. గ్రేటర్ వరంగల్ అడిషనల్ కమిషనర్ నర్సంపేటకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. వరంగల్‌లో పని లేని రోజుల్లోనే నర్సంపేటకు వస్తున్నారు. అక్కడ పని భారం ఎక్కువగా ఉంటుండడంతో నర్సంపేటకు రావడం కష్టంగా మారింది. ఎప్పుడో ఒకసారి వస్తున్నారు. దీనివల్ల పాలన వెనుకబడి పోతున్నదని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే, మంగళవారం వరకు సర్వే పూర్తి చేయాల్సి ఉంది. కానీ, ఇప్పటివరకు సగం సర్వే కూడా జరగలేదు. నర్సంపేటకు కమిషనర్ రావాలంటే ఎవరూ సుముఖత చూపడం లేదని తెలుస్తున్నది. వచ్చినా ఎక్కువ కాలం పని చేసిన సందర్భాలూ లేవు. ప్రజాప్రతినిధులు స్పందించి నర్సంపేట మున్సిపాలిటీపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపాలిటీ కార్యాలయం

గుర్తింపు కార్డు అందజేస్తున్న నాయకులు

'ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులకు ఉచిత ప్రయాణం కల్పించాలి'

చెన్నారావుపేట, నవంబర్ 24: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన విధంగానే 60 ఏళ్లు దాటిన వృద్ధులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని మాజీ జడ్పీటీసీ జున్నుతుల రాంరెడ్డి, సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, వయోవృద్ధుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ కోరారు. ఆదివారం వయో వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా చేరిన సభ్యులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు వరంగంటి మల్లేశ్, కుమారస్వామి, ములుక జగదీశ్, తాళ్లపల్లి నర్సయ్య, సిద్ద కుమారస్వామి, తోట ఆనందం పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

కరీమాబాద్, నవంబర్ 24: అండర్ రైల్వేగేట్ ప్రాంతంలో చాలా చోట్ల రహదారులతోపాటు ఖాళీ ప్రదేశాలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. 40వ డివిజన్ కరీమాబాద్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్క వీధిలోని రహదారిపై నిత్యం చెత్త దర్శనమిస్తున్నది. అధికారులు గోడపై రాసిన 'స్వచ్ఛతా హీ సేవా-2024' కొటేషన్ వద్దే చెత్త ఉండడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది. వెంటనే గ్రేటర్ అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కరీమాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్ పక్క వీధిలో పేరుకుపోయిన చెత్త

నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

కరీమాబాద్, నవంబర్ 24: ఓల్డ్ క్లాసిక్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో కరీమాబాద్‌లోని రామస్వామి గుడి మైదానంలో సోమవారం నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు సమీ అక్మల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం గుడి మైదానంలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి చేతులమీదుగా ట్రోఫీని ఆవిష్కరించి జట్లకు క్రీడా దుస్తులు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు మీరిపెల్లి వినయ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పొగాకు సందీప్, పూజారి విజయ్ పాల్గొన్నారు.

ట్రోఫీని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ మరుపల్ల రవి

అయ్యప్ప ఆలయంలో పూజలు

నర్సంపేట, నవంబర్ 24: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాలధారుల భజనతో అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. అనంతరం గట్టు మహేశ్‌బాబు, ఎస్కే పాషా, పాషా ఆగ్రో ఇండస్ట్రీస్, నీలం వెంకటేశ్వర్లు అరుణ, సాయిశ్రీ ఆస్పత్రి వైద్యుడు ధరావత్ రాంచందర్, డాక్టర్ హైమావతి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, కమిటీ అధ్యక్షుడు సైపా సురేశ్, కార్యదర్శి చింతల కమలాకర్, కార్యదర్శి దొడ్డ రవీందర్, మాదారపు చంద్రశేఖర్, శ్రీరాం ఈశ్వరయ్య, భూపతి లక్ష్మీనారాయణ, రాజశేఖర్, చెంచారావు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న భక్తులు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థి ఎంపిక

నర్సంపేట, నవంబర్ 24: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి శీలం త్రినేశ్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎస్సై అరుణ్‌గౌడ్, ఎంఈవో, హెచ్ఎం కొర్ర సారయ్య అభినందించారు. హైదరాబాద్‌లో సోమ, మంగళవారం జరగనున్న పోటీల్లో త్రినేశ్ పాల్గొననున్నాడు. రిటైర్డ్ టీచర్ కృష్ణారావు అతడికి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పీడీ కోట రాంబాబు, ఉపాధ్యాయులు కృష్ణారావు, రమేశ్, ఉమామహేశ్వర్, రవికుమార్, గోపాల్‌రావు, భిక్షపతి, బుచ్చిరాములు, బాల, శైలజా, వీరస్వామి పాల్గొన్నారు.

అభినందిస్తున్న ఎస్సై అరుణ్, హెచ్ఎం, ఎంఈవో

బియ్యం అందజేస్తున్న బాల్యమిత్రులు

మృతుల కుటుంబానికి మిత్రుల చేయూత

రాయపర్తి, నవంబర్ 24: మండలకేంద్రంలోని రజక కాలనీకి చెందిన మచ్చ సైదులు, అతడి తల్లి మచ్చ ఆండాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సైదులు బాల్యమిత్రులు ఆదివారం మృతుల కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం క్వింటాల్ బియ్యం అందజేశారు. కార్యక్రమంలో బాల్యమిత్రులు మచ్చ రాజు, బండారి హరిశంకర్, పొడిశెట్టి సరితా సుధాకర్, ఎర్ర లింగయ్య, మహ్మద్ రఫీ, మల్యాల కృష్ణ, చిన్నాల రాజు, మచ్చ శివరాజు, మహ్మద్ సర్వర్, కుంట ప్రభాకర్, మచ్చ రమేశ్, గూడ రాజు, దోకురు సోమేందర్, వేముల రమేశ్, సోడెపు శ్రీనివాస్, మహ్మద్ అఫ్సర్‌పాషా, అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

రాయపర్తి, నవంబర్ 24: మైలారం జడ్పీహెచ్ఎస్ 2002-03 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సమ్మేళనం నిర్వహించుకున్నారు. విద్యార్థులంతా 22 ఏళ్ల తర్వాత కలుసుకొని నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు జీఎస్ ఆనంద, కోల రాజు, నవీన్‌కుమార్, హరికృష్ణ, ప్రవీణ్, దేదావత్ వీరన్న, నాగరాజు, సునీత, మంజుల, స్వప్న, జ్యోతి, రాణి, స్పందన, పట్టాపురం భిక్షపతి పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అనాథ వృద్ధులకు అన్నదానం

కాశీబుగ్గ, నవంబర్ 24: కాశీబుగ్గలోని మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో ఆదివారం సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు ఎలుకపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతుగా పేదలు, అనాథలకు సాయం అందించాలని కోరారు. అలాగే, పుట్టిన రోజు, పెండ్లి రోజు, స్వర్గస్తులైన వారి జ్ఞాపకార్థం పేదలకు అన్నదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో బిందు, రాజ్‌కుమార్, కోట బిట్టు, ఎలుకపెల్లి హర్షిత్ పాల్గొన్నారు.



ఆకర్షణీయ సిబిల్ స్కోర్‌కు ఆరు సూత్రాలు

పర్సనల్ ఫైనాన్స్‌లో మూడంకెల క్రెడిట్ స్కోర్‌కు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. మన దేశంలో వ్యక్తులు, కంపెనీల రుణ పరపతిని వారివారి రుణ చరిత్రల ఆధారంగా మదింపు చేయడంలో సిబిల్ (క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ఇండియా) లిమిటెడ్) సమాచారాన్ని ప్రధానంగా రుణదాతలు (బ్యాంకులు, ఇతరత్రా ఆర్థిక సంస్థలు) విశ్వసిస్తున్నారు. 300 నుంచి 900 వరకు క్రెడిట్ స్కోర్లను సిబిల్ ఇస్తున్నది. రుణాలు, క్రెడిట్ కార్డులు తదితర రుణ సదుపాయాల కల్పనలో వ్యక్తులు, సంస్థల అర్హతను నిర్ధారించడంలో ఈ స్కోరే కీలకం. అధిక స్కోర్ రుణగ్రహీతల ఆర్థిక పరిపుష్టికి నిదర్శనంగా నిలుస్తుంది. దీంతో రుణాలు సులభంగా లభిస్తాయి. పైగా తక్కువ వడ్డీరేటుకే దొరుకుతాయి. అలాగే స్కోర్ తగ్గితే రుణ లభ్యత అవకాశాలు కూడా అంతంతమాత్రంగానే ఉంటాయి. వడ్డీరేట్లూ ఎక్కువగానే పడుతాయి. సిబిల్ స్కోర్ 750, అం తకన్నా ఎక్కువగా ఉంటే వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులను విరివిగా అందుకోవచ్చు. ఒకవేళ స్కోర్ 685 కంటే తక్కువగా ఉంటే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు రుణాలిచ్చేందుకు వెనుకాడుతాయి. కాబట్టి ఆకర్షణీయ సిబిల్ స్కోర్ కూడా ఆర్థిక లక్ష్యాల్లో ప్రధానమే.

స్కోర్ పెంపునకు మార్గాలు

సకాలంలో చెల్లింపులు

క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేసే అంశాల్లో సకాలంలో జరిపే చెల్లింపులు కీలకం. తీసుకున్న రుణాలను గడువులోగా చెల్లించడం, వాటి ఈఎంఐలను నిర్ణీత తేదీల్లో మిస్సవ్వకుండా చూసుకోవడం ముఖ్యం. పేమెంట్లలో ఆలస్యం క్రెడిట్ స్కోర్‌ను వేగంగా తగ్గించడమేగాక, డిఫాల్టర్ (ఎగవేతదారు లేదా మొండి బకాయి)గా మార్చే ప్రమాదమూ ఉన్నది. దీని వల్ల భవిష్యత్తులో రుణ సదుపాయాలను అందుకోవడం కష్టమవుతుంది. ముఖ్యంగా గృహ, వాహన రుణాలు పొందడం పెద్ద సమస్యగానే పరిణమిస్తుంది.

పరిమితంగా రుణాలు

రుణాలను పరిమితంగా తీసుకోవడమే ఉత్తమం. మనకున్న రుణ పరిమితిలో దాదాపు 30 శాతాన్ని మాత్రమే వినియోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే క్రెడిట్ స్కోర్ బాగుంటుందని చెప్తున్నారు. సామర్థ్యానికి మించి ఉండే రుణ భారం వల్ల ఇబ్బందులు తప్పవు. కనుక అత్యవసరమైతే తప్ప రుణాల జోలికి వెళ్లకుండా ఉండటమే తెలివైన పని. అంతేగాక కీలకమైన గృహ రుణాల వంటి వాటికి అర్హత అనేది ఉంటుంది. కాబట్టి ప్రతీ చిన్న అవసరానికి అప్పులు చేయకుండా ఉండాలి.

అప్పుల అన్వేషణ వద్దు

కొత్త రుణాల కోసం తరచూ అన్వేషించడం కూడా మన క్రెడిట్ స్కోర్‌ను రిస్కులో పడేస్తుంది. రుణాల కోసం ఎక్కువగా వాకబు చేయడం వల్ల మన ఆర్థిక పరిస్థితి బాగాలేదన్న సంకేతాలు క్రెడిట్ బ్యూరో సంస్థలకు వెళ్తాయి. దీనివల్ల మన క్రెడిట్ స్కోర్ తగ్గిపోతూ ఉంటుంది. కాబట్టి అవసరం ఉన్నా.. లేకున్నా.. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల వద్దకు వెళ్లి రుణాల కోసం ప్రయత్నించకండి. దానివల్ల రుణదాతలు మీ రుణ చరిత్రను పరిశీలిస్తూ ఉంటారు. పదేపదే ఈ పని జరిగితే అది మీకే నష్టం.

పొరపాట్లను సరిచేయాలి

క్రెడిట్ స్కోర్‌ను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఉండాలి. అప్పుడప్పుడు మనం తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించినప్పటికీ ఆ సమాచారం క్రెడిట్ బ్యూరోకు ఉండదు. దానివల్ల మన క్రెడిట్ స్కోర్ పెరగకుండా ఉంటుంది. అలాంటప్పుడు రుణదాత (బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ)లను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. ఇక ఇప్పుడు ఆన్‌లైన్‌లో చాలా ఏజెన్సీలు ఉచితంగానే మనకు క్రెడిట్ స్కోర్‌ను తెలియజేస్తున్నాయి. కనుక తరచూ మన స్కోర్‌ను చెక్ చేసుకోవడం ఉత్తమం.



గ్యారంటీలకు దూరంగా..

గ్యారంటీలకు దూరంగా ఉండాలి. మనలో చాలామంది స్నేహితులనో, బంధువులనో, తెలిసినవారు లేదా ఇరుగుపొరుగువారంటూ వారి రుణాలకు పూచికత్తు సంతకాలు చేస్తూ ఉంటాం. కానీ ఇదంత శ్రేయస్కరం కాదని ఆర్థిక నిపుణులు, బ్యాంకింగ్ వర్గాలు చెప్తున్నాయి. ఒకవేళ వారు తీసుకున్న రుణాలను చెల్లించకపోతే ఆ రుణ భారం మీ మీద పడుతుంది. ఆ రిస్కు పెరిగితే ఆటోమేటిగ్గా మీ క్రెడిట్ స్కోర్ సైతం క్షీణిస్తూ పోతుందన్న విషయం మరువద్దు. అందుకే తప్పని పరిస్థితుల్లో తప్ప వీలైనంత వరకు గ్యారంటీలకు దూరంగా ఉండాలి.

సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు

సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు వ్యక్తుల క్రెడిట్ స్కోర్‌ను పెంచడంలో దోహదపడుతాయి. సాధారణ క్రెడిట్ కార్డుల మాదిరి కాకుండా ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు మీరు చేసే డిపాజిట్ల ఆధారంగా లభిస్తాయి. పరిమిత రుణ చరిత్ర ఉన్నవారు, క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్నవారు వీటిని తీసుకొని మెరుగైన స్కోర్‌ను సాధించవచ్చు. మీరెంత నగదు డిపాజిట్ చేస్తే.. దానికి సమాన స్థాయిలోనే సదరు క్రెడిట్ కార్డు రుణ సదుపాయ పరిమితి ఉంటుంది. సకాలంలో కార్డు బిల్లులను చెల్లిస్తూపోతే స్కోర్ క్రమేణా పెరుగుతూపోతుంది.

రాబడి

పిల్లల విద్య కోసం..

పిల్లల విద్య కోసం ప్రణాళిక అనేది తల్లిదండ్రులకున్న అత్యంత కీలక ఆర్థికాంశం. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే వారి ఉన్నత విద్య ఖర్చుల కోసం పొదుపు చేయడం ఎంతో తెలివైన పని. అయితే అందుకున్న మార్గాలను పరిశీలిస్తే..

ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లు

పిల్లల ఉన్నత విద్య వంటి దీర్ఘకాల లక్ష్యాల కోసం స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు సరైన నిర్ణయమనే చెప్పవచ్చు. మ్యూచువల్ ఫండ్లలో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్) ద్వారా ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టవచ్చు.

హైబ్రిడ్ ఫండ్స్

హైబ్రిడ్ ఫండ్స్.. అటు ఈక్విటీల్లో, ఇటు డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెడుతాయి. వీటిలో రిస్క్, రిటర్న్స్ అనేవి సమతూకంగా ఉంటాయి.

విద్యా పథకాలు

వివిధ మ్యూచువల్ ఫండ్స్ పిల్లల విద్య కోసం రకరకాల పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. ఇవి ఈక్విటీలు, రుణ లేదా బంగారాల్లో పెట్టుబడులు పెడుతాయి.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు

తక్కువ రాబడులను అందించినా.. సురక్షిత పెట్టుబడులుగా వీటిని చెప్పుకోవచ్చు. ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే వీటిలో రిస్క్ ఉండదు. కచ్చితమైన రాబడులుంటాయి.

విద్యా రుణాలు

ట్యూషన్ ఫీజులు, రోజువారీ జీవన ఖర్చులు, ఇతరత్రా వ్యయాలను ఈ విద్యా రుణాలతో అధిగమించవచ్చు. పిల్లల విద్య పూర్తయిన తర్వాత తిరిగి చెల్లించేలా మారటోరియం పీరియడ్‌కు వీలుంటుంది. అంతేగాక పాత పన్ను విధానం కింద ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80ఈ ద్వారా రుణగ్రహీతలు పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు.

బీమా ప్లాన్లు

చైల్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు.. అటు పెట్టుబడి, ఇటు బీమా సదుపాయంతో ఉంటాయి. ఒకవేళ పాలసీదారు దురదృష్టవశాత్తు చనిపోతే ఒకేసారి పెద్దమొత్తంలో కుటుంబీకులకు ధన సాయం లభిస్తుంది.



ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తారా?

ఒక కంపెనీ షేర్లను దాని ఈక్విటీలో పాల్గొని మదుపరులు కొనుగోలు చేయవచ్చు. లిస్టెడ్ కంపెనీలైతే వాటి షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదై ఉంటాయి. దీంతో ఎక్స్ఛేంజీల ద్వారా వాటిని కొనవచ్చు. ఇందుకు డిపాజిటరీ పార్టిసిపెంట్‌తో కూడిన డీమ్యాట్ అకౌంట్, బ్యాంక్ అకౌంట్‌లు అవసరం. అలాగే షేర్ల క్రయవిక్రయాల కోసం బ్రోకర్‌తో ఓ ట్రేడింగ్ అకౌంట్‌ను తెరవడం కూడా ముఖ్యమే.

ఈటీఎఫ్‌ల ద్వారా..

ఏదో ఒక షేర్‌లో పెట్టుబడులు పెట్టడానికి బదులుగా ఎక్స్ఛేంజ్‌పై నమోదైన ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఇండెక్స్ ఫండ్స్ (ఈటీఎఫ్)ను కొనడం ద్వారా మొత్తం ఇండెక్స్‌లోనే పాలుపంచుకోవచ్చు. అలాగే ఈటీఎఫ్ ఇన్వెస్ట్‌మెంట్.. పెట్టుబడి వైవిధ్యాన్ని కూడా చూపిస్తుంది.

ఈక్విటీ ఎంఎఫ్‌లు

ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) స్కీముల ద్వారా కూడా ఈక్విటీల్లో మదుపు చేయవచ్చు. ఈ పథకాలు తమ దగ్గరున్న నిధుల్లో 65 శాతం లేదా అంతకన్నా ఎక్కువ మొత్తాలను ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో పెట్టుబడిగా పెడుతాయి. ఎంఎఫ్ వెబ్‌సైట్ల నుంచి ఆన్‌లైన్‌లో లేదా డిస్ట్రిబ్యూటర్ ఆధారిత ఎంఎఫ్ లావాదేవీ పోర్టల్‌ల ద్వారా పెట్టుబడులకు వీలుంటుంది. సిప్ ద్వారా కూడా పెట్టుబడులకు దిగవచ్చు.

ఒడిదొడుకుల్లోనే పయనం

దేశీయ స్టాక్ మార్కెట్లలో తీవ్ర స్థాయిలో ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. గడిచిన నెల 15 రోజులుగా సూచీలు పడుతూలేస్తూనే పయనిస్తున్నాయి. దేశ, విదేశీ ప్రతికూలతల నడుమ మదుపరులు పెట్టుబడుల విషయంలో ఆచితూచి స్పందిస్తున్నారు. అయితే అమ్మకాలు.. లేదంటే కొనుగోళ్లకు పెద్దపీట వేస్తూ పోతున్నారు. ఈ క్రమంలోనే గత వారం సూచీలు పెద్ద ఎత్తున లాభాలను అందుకున్నాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,536.80 పాయింట్లు లేదా 1.98 శాతం ఎగిసి 79,117.11 వద్ద నిలిచింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 374.55 పాయింట్లు లేదా 1.59 శాతం ఎగబాకి 23,907.25 దగ్గర ముగిసింది. ఆ మునుపటి వారం ఇంతకన్నా ఎక్కువ నష్టాలపాలైన సంగతి విదితమే. ఇక ఈ వారం విషయానికొస్తే.. మార్కెట్లను ప్రభావితం చేసే అంశాలు చాలానే ఉన్నాయి. తీవ్రరూపం దాల్చుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అమెరికాలో అదానీపై కేసు, క్యూ2 జీడీపీ గణాంకాలు, విదేశీ మదుపరుల పెట్టుబడులు ప్రధానంగా చెప్పుకోవచ్చు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు కూడా ముఖ్యమే. దీంతో ఆటుపోట్లకు ఆస్కారం ఎక్కువగానే ఉన్నది. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,300-24,500 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.



గమనిక..: స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్